ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0

ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయి



తణుకు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లు బర్డ్‌ఫ్లూ వల్లే చనిపోయినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక సమాచారం వచ్చింది. ఇదే విషయాన్ని గెజిట్‌లో ప్రచురించి సదరు కోళ్లు చనిపోయిన ఫారాల నుంచి కిలోమీటరు వరకు ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, పది కిలోమీటర్ల పరిధిని సర్వైలెన్స్ జోన్‌గా ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 10న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరులోని పౌల్ట్రీ ఫారంలోను, 11న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు కృష్ణానందం పౌల్ట్రీ ఫారంలోను, 13న ఉంగుటూరు మండలం బాదంపూడి పౌల్ట్రీ ఫారంలోను వేలాది కోళ్లు చనిపోయాయి. ఇవన్నీ బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయని భావించినప్పటికీ అధికారికంగా నిర్ధారణ అయ్యే వరకు చెప్పలేమని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే ముందు జాగ్రత్త

- భోపాల్ ల్యాబ్‌కు కానూరు, వేల్పూరు బాదంపూడి పౌల్ట్రీల్లోని కోళ్ల నమూనాలు.. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ చేసిన నిపుణులు

చర్యగా కోళ్లను పూడ్చిపెట్టడంతోపాటు పరిసర ప్రాంతాలను నిషిద్ధ ప్రాంతాలుగా ప్రకటించి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చనిపోయిన కోళ్ల శాంపిల్స్‌ను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజస్‌కు పంపగా ఈ కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఇదే విషయాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. దీంతో ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఇన్ఫెక్షియస్ అండ్ కంటాజియస్ డిసీజెస్ ఇన్ యానిమల్స్ యాక్ట్ కింద కానూరు, వేల్పూరు, బాదంపూడిల్లోని బర్డ్‌ఫ్లూ ప్రభావిత కోళ్ల ఫారాల

- కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అధికారిక సమాచారం.. జీవో నెంబరు 122 జారీ

నుంచి కిలోమీటరు వరకు ఉన్న పరిధిని ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలను సర్వై లెన్స్ జోన్‌లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాంతాల నుంచి కోళ్లను ఇతర ప్రాంతాలకు రవాణా చేయడంపై ఆంక్షలు అమలు చేయాలని సూచించారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం జీవో నెం.122 జారీ చేశారు. అయితే అధికార యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్తలు తీసుకున్నందున ఈ ఆదేశాలు అమలు చేస్తారా ? లేదా ? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

బర్డ్ ఫ్లూ కారణంగా పౌల్ట్రీ ఫారంలో చనిపోయిన కోళ్లు (ఇన్‌సెట్‌లో) పూడ్చిపెడుతున్న దృశ్యం (ఫైల్)

పెరిగిన వినియోగం

బర్డ్ ఫ్లూ ప్రభావంతో ఫిబ్రవరిలో 22 రోజులపాటు అలెర్ట్ జోన్ పరిధిలోని తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో చికెన్, కోడి గుడ్ల అమ్మకాలు, వినియోగం నిలిచిపోయింది. దీనితో చికెన్, గుడ్ల సంబంధిత రంగాలు మూసివేశారు. తిరిగి మార్చి ఒకటి నుంచి చికెన్, ఎగ్ మేళాలను నిర్వహించి చికెన్, కోడి గుడ్ల వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించారు. ఇప్పుడిప్పుడే చికెన్ అమ్మకాలు గాడిన పడి వ్యాపారాలు సాగుతున్నాయనే ధీమాలో చికెన్, కోడి గుడ్ల వ్యాపారులతోపాటు చికెన్ పలావ్, పకోడి వ్యాపారులు ఉన్నారు.

11న సీఎం పర్యటన

- ఖరారు కాని టూర్ షెడ్యూల్



నూజివీడు టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అధికారికంగా నియోజకవర్గంలో ఏ గ్రామంలో పర్యటించనున్నది ఇంకా నిర్ణయం కాకపోయినా నూజివీడు మండలం బత్తులవారిగూడెం, ముసునూరి మండలం కాట్రేనిపాడు, ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామాల్లో ఏదో ఒక గ్రామం లో పర్యటించనున్నట్టు తెలుస్తుంది. పీ-4 గ్రామాలైన వీటిపై అధికారులు కసరత్తు చేస్తునట్టు తెలుస్తుంది.

జేఈఈ మెయిన్‌కు 260 మంది హాజరు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ పరీక్షల్లో భాగంగా గురువారం వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్‌ఈ పాఠశాల కేంద్రంలో జరిగిన పరీక్షల ఉదయం షిఫ్టునకు 153 విద్యార్థులను కేటాయించగా 137మంది, మధ్యాహ్నం షిఫ్టునకు 133 మందికి 123 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 26 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో
సీటీ స్కాన్



- నెల రోజుల తర్వాత అందుబాటులోకి..

■ లోపలి పేజీలో..

రైతు సమస్యలు తెలుసుకోవడానికి..
ప్రతి శుక్రవారం ఫోన్ ఇన్ : కలెక్టర్



ఎంపీడీవోలతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు/ ఏలూరు సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కనీస మద్దతు ధర కోరుకునే స్థాయి నుంచి తాను పండించిన పంటకు డిమాండ్ చేసే స్థాయికి జిల్లాలోని ప్రతి రైతును తీసుకెళ్లేలా వ్యవసాయ అధికారులందరూ పనిచేయాలని, రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రజ్ఞులతో ప్రతి శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖా ధికారి హబీబ్‌బాషాను కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయశాఖాధికారులు, రైతులతో కలెక్టర్ సమీక్షించారు. సాగులో డ్రోన్స్‌తో పాటు యాంత్రీకరణను ప్రోత్సహించడం, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మార్క్‌ఫెడ్ , ఏపీ సీడ్స్ , ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్లు గుప్తా, అనిత, హరీష్, వ్యవసాయ శాఖ శాస్త్రజ్ఞులు, అసిస్టెంట్ డైరక్టర్లు, మండల వ్యవసాయశాఖాధికారులు, రైతులు పాల్గొన్నారు.

- బీసీలు, కాపు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల్లో అర్హుల జాబితాలను రుణాల మంజూరు కోసం వెంటనే బ్యాంకులకు పంపాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆమె టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 30,436 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందిన దరఖాస్తులను బ్యాంకర్లతో కలిసి పరిశీలించి, లక్ష్యాల మేర రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు.
- జిల్లాలో సత్యసాయి తాగునీటి పథకం కింద గోపాలపురం, పోలవరం, చింతలపూడి, కొవ్వూరు నియోజకవర్గాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణపై గురువారం ఆమె అధికారులతో సమీక్షించారు.

సత్వర వైద్యం



జిల్లాలోని ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రుల్లో సత్వర వైద్యసేవలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మందుల కొరత లేదు. డాక్టర్ల కొరత ఉంది. త్వరలో నూతన వైద్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అన్నిచోట్ల కొరత లేకుండా డాక్టర్లను నియమిస్తారని ఆశిస్తున్నాం. వైద్య సేవల్లో లోపాలపై ఎప్పటికప్పుడు జూమ్ మీటింగ్‌లతో పర్యవేక్షిస్తూ పారదర్శకంగా సేవలను అటు వైద్యులు, ఇటు సిబ్బంది అందించేలా చూస్తున్నాం..

– డాక్టర్ పాల్ సతీష్ కుమార్, డీసీహెచ్ఎస్

- డాక్టర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు
- నూజివీడు ప్రభుత్వాస్పత్రి సమస్యలపై త్వరలో తనిఖీ
- ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్

ఏలూరు/ఏలూరు క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల తరపున వారధిగా 'ఆంధ్రజ్యోతి' నిలిచి గురువారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. నూజివీడులో నూతనంగా నిర్మించిన ఆస్పత్రిలోని సమస్యలపై ప్రజలు, రోగులు గొంతెత్తారు. భీమడోలు, కైకలూరులోని సమస్యలతో పాటు భీమడోలులో ట్రామా కేర్ ఏర్పాటు ఆవశ్యకతపై ప్రజలు విన్నవించారు. త్వరలో అన్ని ఆస్పత్రులను తనిఖీ చేసి, అక్కడ ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను సత్వరం పరిష్కారం చేపడతామని జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ భరోసా ఇచ్చారు.

అత్యవసర సమయాల్లో ఇబ్బందులు

- చింతలపూడిలో 20 ఏళ్ల నుంచి 100 పడకల ఆస్పత్రి పూర్తి కావడం లేదు. డాక్టర్ల కొరత వల్ల ప్రాణం మీదకు వస్తే ఏలూరు ఆస్పత్రే దిక్కవుతోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేయండి.

– నాగరాజు, పొనుకుపాడు, చింతలపూడి మండలం

డీసీహెచ్ఎస్ : ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఫ్లోరింగ్, పైప్‌లైన్లు, డ్రెయినేజీ ఇతర పనులు చేస్తున్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఇప్పటికే కోరారు. 15 రోజుల్లో డాక్టర్ల పోస్టులు భర్తీ అయ్యే అవకాశం. మీ దగ్గరకు కొత్త డాక్టర్లు వస్తారు.

- భీమడోలు హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి. ఆయా గ్రామాల ప్రజలు ప్రమాదాల బారిన పడినప్పుడు, ఏలూరుకు తరలించడం కష్టంగా ఉంటోంది.

– దుర్గాప్రసాద్, వంగాయగూడెం, ఏలూరు

డీసీహెచ్ఎస్ : భీమడోలు హైవే పరిసరాల్లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి రిఫర్ చేశాం. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కూడా మాట్లాడారు. మంజూరుకు అవకాశం వస్తుందని భావిస్తున్నాం.

- భీమడోలు మండల కేంద్రంలో పాములు కరిస్తే రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసరంగా ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించడం కష్టంగా ఉంది.

– కరటూరి వెంకట జగప్రసాద్, భీమడోలు

డీసీహెచ్ఎస్ : ఏ పాము కరిచినా తక్షణం వైద్య సేవలకు పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ ఇంజక్షన్ ఇస్తుంటారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరుకు తరలించే చర్యలు తీసుకుంటాం.

- కైకలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కళ్లజోళ్ల పరీక్షలు చేశారు. ఇంకా కళ్లజోడులు ఇవ్వలేదు. బయట కొనుక్కోలేకపోతున్నాం.

– మహాలక్ష్మి, కైకలూరు

డీసీహెచ్ఎస్ : కళ్లజోడుల సరఫరాకు అపోలో ఏజన్సీతో ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నాక, ఆస్పత్రులకు సరఫరా చేస్తారు. అంతవరకు వేచి ఉండాలి.

- దివ్యాంగుల గుర్తింపు కోసం సదరం క్యాంపులు ఎప్పుడు.. ఏర్పాటు చేస్తారు.

– దుర్గారావు, మండవల్లి మండలం కానుకొల్లు.

డీసీహెచ్ఎస్ : ఈనెల నాలుగో తేదీని ఏలూరు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సదరం క్యాంపు నిర్వహిస్తున్నాం. గ్రామ సచివాలయం నుంచి ఆధార్, రేషన్‌కార్డుతో స్లాట్ బుక్ చేసుకునిరావాలి. జిల్లా అంతటికీ ఏలూరులోనే సదరం శిబిరం నిర్వహిస్తున్నాం.

వైద్య సేవల్లో అలక్ష్యం..

- నేను షుగర్ టెస్ట్ కోసం నూజివీడు ఆస్పత్రికి రాగా మణికట్టు నుంచి కాకుండా మోచేతి నుంచి రక్తం తీశారు.

– ఏలియా, రేగుంట,నూజివీడు మండలం

డీసీహెచ్ఎస్ : ర్యాపిడ్ టెస్ట్ కోసం ఏ నరం నుంచి అయినా రక్తం తీసి పరీక్షించవచ్చు. ఇబ్బందేమి ఉండదు.

- నేను పక్షవాతంతో బాధపడుతున్నారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో మందులు వాడుతున్నాం. ఈ మందుల ఎలా వాడాలో డాక్టర్లు చెప్పడం లేదు. చాలా ఇబ్బందిగా ఉంటుంది.

– బాలరాజు, లంకపేట, ఏలూరు

డీసీహెచ్ఎస్ : మరోసారి ఈ సమస్య పునరావృతం కాకుండా డాక్టర్లకు సూచనలు చేస్తాం.

- భీమడోలు ఆస్పత్రిలో షుగర్, బీపీ, కంటి పరీక్షలు చేయడానికి వైద్యులు లేరు. అత్యవసర కేసులను లేటుగా ట్రీట్ చేస్తున్నారు. 24 గంటలకు డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. ఎండీ డాక్టర్ లేరు. చిన్న పిల్లలు డాక్టర్ లేరు.

– శేషగిరి, సాయిప్రసాద్, హరినాథరాజు, భీమడోలు

డీసీహెచ్ఎస్ : అందుబాటులో ఉండని వైద్యులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ఇక్కడ ఎండీ డాక్టర్ పద్మలత ఉన్నారు. వారానికి రెండు రోజులు అసిస్టెంట్ పారామెడికల్ సిబ్బంది వచ్చి కంటి పరీక్షలు చేస్తున్నారు. కంటి, చిన్నపిల్లల డాక్టర్ పోస్టుల భర్తీకి త్వరలోనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- కైకలూరు ఏరియా ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. ఐదు గంటలు దాటితే ఒక్కరు ఉండడం లేదు. ప్రమాదాల జరిగినప్పుడు వేగంగా స్పందించడం లేదు. నామమాత్రంగా వైద్యపరీక్షలు చేస్తున్నారు. రాత్రి వేళ్లలో అందుబాటులో ఎవ్వరు ఉండడం లేదు. అందుకే ఏలూరు వెళ్లాల్సి వస్తోంది.

–నాగరాజు, రహీమ్, కైకలూరు

డీసీహెచ్ఎస్ : డాక్టర్లు ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు ఆస్పత్రిలో ఉంటారు. ఆ తర్వాత ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ ఉంటారు. రాత్రి వేళల్లో డాక్టర్ అందుబాటులో ఉండే ఏర్పాటు చేస్తాను.



చింతలపూడిలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రి



నూజివీడు ప్రభుత్వాస్పత్రి

నూజివీడు ప్రభుత్వాస్పత్రిపై ఫిర్యాదుల వెల్లువ

- నూజివీడు ప్రభుత్వాస్పత్రిని రూ.21 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించారు. ఇప్పటికీ అందుబాటులోకి తేలేదు. పేషెంట్ల పరీక్షలు చేసే గదులను స్టోర్స్‌కు వాడుతున్నారు. ఫ్యాన్లు, ఇతర సౌకర్యాల్లేవు. ఇళ్ల నుంచి టేబుల్ ఫ్యాన్లు తెచ్చుకోవాలంటున్నారు. ఓపీ దగ్గర మంచినీటి సౌకర్యం లేదు. డాక్టర్లు ఎవ్వరూ స్పందించరు. అవమానకరంగా మాట్లాడుతున్నారు. సూపరింటెండెంట్ పట్టించుకోవట్లేదు.

– ఇందూరి చంటి, దద్దనాల శివ, నర్సింహ, శివరామ్, నూజివీడు

డీసీహెచ్ఎస్ : నిర్మాణ పనులు ఇటీవల ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేసి భవనాలు అప్పగించారు. స్టోర్సు నుంచి సామగ్రి ఖాళీ చేయిస్తాం. మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. డాక్టర్లు వ్యవహారశైలిపై కొద్దిరోజుల్లో అక్కడ సందర్శించి చర్యలు తీసుకుంటాను. ఈ విషయాలు నా దృష్టిలో ఉన్నాయి.

- నూజివీడులో బ్లడ్‌బ్యాంక్ అంటూ రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఏ విధమైన ఉపయోగం లేకుండా ఉంది. ఆస్పత్రి గేటు వద్దే ప్రైవేట్ అంబులెన్స్‌ల దందా ఎక్కువైంది. ఏదైనా పరీక్షల కోసం బయటకు ట్రీట్‌మెంట్ ఓపీ రాయమంటే రిఫర్ చేయడానికి డాక్టర్లు స్పందించడం లేదు. 108 సిబ్బంది తీసుకెళ్లడం లేదు. దీంతో వేలాది రూపాయలు ప్రైవేట్ అంబులెన్సులకు ఖర్చు అవుతోంది. దీనిపై చర్యలు తీసుకోవాలి.

– కృష్ణ, డేవిడ్ స్మాలన్‌రాజు, ఎం.సునీల్‌కుమార్, నూజివీడు

డీసీహెచ్ఎస్ : బ్లడ్‌బ్యాంకు నిర్వహణకు లైసెన్సుకు అప్లయ్ చేశాం. అనుమతి రావాలి. డాక్టర్లు కావాలంటే ఆస్పత్రి నిర్మాణం కావాల్సి ఉన్నందున అలా చేశాం. డాక్టరు పోస్టుల భర్తీ కాగానే ఇక్కడికి పంపుతాం. బ్లడ్‌బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆస్పత్రి అంబులెన్స్ ఉంది. అయితే డ్రైవర్ లేకపోవడం సమస్య ఉంది. అత్యవసరమైతే డ్రైవరిని పంపుతున్నాం. అంబులెన్సుల దందాను అరికడతా. కలెక్టర్ ఆదేశాల మేరకే కిలోమీటరుకు ఎంత తీసుకోవాలో ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాం. ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు అదనంగా వసూలు చేస్తే వారిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం. ఇక్కడే ధరల పట్టిక ప్రదర్శిస్తాం.

- నూజివీడు ప్రభుత్వాస్పత్రిలో ఏదైనా చికిత్స కోసం ఎక్సరేల కోసం వెళితే బయటకు వెళ్లి తీసుకుని రమ్మంటున్నారు. ఓపీ నార్మల్‌గా చూసి పంపేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

– సుమన్, చనుబండ, చాట్రాయి మండలం

డీసీహెచ్ఎస్ : దీనిపై విచారణ చేసి బాధ్యుపై చర్యలు తీసుకుంటాను.

అభ్యంతరాలు, అర్జీల పరిష్కారంతో.. టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

- నేటికి సోషల్ స్టడీస్ స్పాట్ వాయిదా

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో ప్రారంభమైంది. ఆయా జిల్లాల నుంచి మూల్యాంకనం నిమిత్తం 1.85 లక్షల వివిధ సబ్జెక్టు జవాబు పత్రాలు అందాయి. ఆ సంఖ్యకు అనుగుణంగానే ఈనెల 9నాటికి స్పాట్ వాల్యూయేషన్‌ను ముగించడానికి అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయ సిబ్బందికి విధులు కేటాయించగా పలువురు ఆసక్తి కనబరచకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికార వర్గాలు కొంత ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. పలు అభ్యంతరాలు, అభ్యర్థనలు, మినహాయింపులను పరిష్కరించిన తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి కొన్ని సబ్జెక్టుల మూల్యాంకనాన్ని ప్రారంభించారు. అయితే అన్ని సబ్జెక్టుల నుంచి సీఈలు 24 మంది, ఏఈలు 60 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 33 మంది ఇంకా అవసరమ తారని సాయంత్రానికి గుర్తించిన అధికారులు, ఆ లోటును భర్తీచేయడానికి మండలాల్లో అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి శుక్రవారం స్పాట్ డ్యూటీలకు పంపాలని డీవైఈవోలు, ఎంఈవోలను ఆదేశించారు. ఇంగ్లీషు సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనానికి సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది. ఈ దఫా రెగ్యులర్ టెన్త్ పరీక్షలతో పాటే సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య పదో తరగతి పరీక్షలను ఒకేసారి నిర్వహించడం, మూల్యాంకనాన్ని ఏకకాలంలో చేపట్టాల్సి రావడంతో ఉపాధ్యాయ సిబ్బంది కొరత ఏర్పడిందని చెబుతున్నారు. ఆ ప్రకారం 30 శాతం అదనపు సిబ్బంది సహా మొత్తం 1,309 మందికి స్పాట్ డ్యూటీలను కేటాయించారు. వీరిలో అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు, రిటైర్మెంట్‌కు సమీపంలో వున్నవారికి మినహాయింపు సహజంగానే ఇస్తారు. ఇదేకోవలో మరికొందరు మినహాయింపుల కోసం విద్యాధికారుల వద్దకు క్యూ కట్టడంతో స్పాట్ క్యాంపువద్ద రిపోర్టు చేయాల్సిందేనని మైకులో పలుమార్లు హెచ్చరించాల్సి వచ్చింది. ఈ క్రమంలో అనారోగ్య కారణాలతో వున్నవారికి మూల్యాంకనం విధులు కేటాయించడంపై ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సభ్య సంఘాల నాయకులు కొందరు అభ్యంతరాలను డీఈవో ఎదుట ఉంచారు. స్పాట్ క్యాంప్‌లో దిగువస్థాయి సిబ్బంది కొందరు ఉపాధ్యాయులను చులకనగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పలువురికి మినహాయింపులు ఇచ్చిన అనంతరం, మూల్యాంకనం విధులకు సరిపడా ఉపాధ్యాయ సిబ్బంది నుంచి రిపోర్టు తీసుకుని, సాయంత్రానికల్లా మిగిలిన వారందరికీ రిలీవింగ్ ఆర్డర్లు జారీచేసి ఆయా పాఠశాలలకు పంపించి వేశారు. 'చివరిగా జరిగిన సోషల్ స్టడీస్ పరీక్ష జవాబు పత్రాలు మూల్యాంకనం నిమిత్తం గురువారం సాయంత్రానికి చేరుకున్నాయి. వీటికి బార్‌కోడింగ్ ఇచ్చిన తర్వాతే మూల్యాంకనం చేయాల్సి ఉన్నందున శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు వీలు గా సోషల్ సబ్జెక్టు స్పాట్ సిబ్బంది సేవలను ఒక రోజు ఆలస్యంగా వినియోగించుకుంటాం. సహేతుక కారణాలతో అభ్యర్థనలు ఇచ్చినవారందరికీ పరిశీలించి స్పాట్ విధులనుంచి మినహాయింపులు ఇచ్చాం. గడువు తేదీలోగానే మూల్యాంకనం ప్రక్రియను ముగిస్తాం' అని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.



గ్జేవియర్ స్కూల్లో టెన్త్ స్పాట్ వాల్యూయేషన్‌కు ఎంట్రీ చేసుకుంటున్న ఉపాధ్యాయులు

ఎండ వర్షం



ఇబ్రహీంపేటలో కురుస్తున్న వర్షం

కుక్కునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం విభిన్న వాతావరణం నెలకొంది. జిల్లావ్యాప్తంగా ఒకవైపు ఎండలు మండిపోగా కుక్కునూరు మండలంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎండల ధాటికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోతతో జనం అవస్థలు పడ్డారు. కాగా కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, తొండిపాకలో గురువారం పగటి పూట ఓ మోస్తారు వర్షం కురిసింది. వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలకు కొంతవరకు ఉపశమనం లభించింది. తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఆ ప్రభావం మండలం పైన చూపించింది. రాత్రికి మండలంలోని అన్ని గ్రామాల్లోను వర్షం కురిసింది. శుక్రవారం కూడా వర్షం కురిసే అవకాశం ఉండడంతో మిర్చిరైతులు అప్రమత్తమయ్యారు. కళ్లాల్లో వందలాది క్వింటాళ్ల మిర్చి ఉంది. ఆ మిర్చినంతా కుప్పలుగా పోసి టార్పాలిన్లు కప్పారు. ఇబ్రహీంపేట, తొండిపాకలో గ్రామాల్లో కురిసిన వర్షానికి మిర్చి తడిచినట్టు రైతాంగం చెబుతున్నారు.



నిత్యం రద్దీగా ఉండే ఏలూరులోని బస్టాండ్ నుంచి సత్రంపాడు వెళ్లే రోడ్డు ఎండల ధాటికి గురువారం మధ్యాహ్నం ఇలా నిర్మానుష్యంగా కన్పించింది.

ఎండ మంటలు


నిర్మానుష్యంగా మారిన భీమవరం అంబేద్కర్ సెంటర్

సూరీడు భగ్గుమన్నాడు.. గురువారం వేడిగాలుల ప్రభావంతో ప్రజలు అల్లాడారు. ఉదయం పది దాటాక బయటకు రావాలంటే భయపడి పోతున్నారు.. బయటకు వెళ్లితే గాని రోజు గడవని కూలీలు, స్కూల్‌కు వెళ్లే పిల్లలు ఎండలకు ఇబ్బందులు పడ్డారు.. ఉదయం ఎండ మండినా సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో వర్షంతో వాతావరణం చల్లబడింది..ఏలూరు నగరం, భీమవరం పట్టణాల్లో గురువారం ఎండ ప్రభావం దృశ్యాలివి..


ఖాళీగా ఉన్న ఏలూరు ఫైర్‌స్టేషన్ రోడ్డు



జలకాలాటలలో..



ఎండ మామూలుగా లేదు.. ఉదయం పది దాటితే ఎండ దెబ్బకు ఒళ్లంతా మంటలే.. ఎండ దాటికి బయటకు వచ్చే పరిస్థితి లేదు..ఎక్కడైనా ఇలాంటి నీటి ప్రవాహం కనిపిస్తే అమాంతం నీటిలోకి దూకి సేద తీరాలనిపిస్తుంది.. పోలవరం మండలం గూటాల పంపింగ్ స్కీం వద్ద గోదావరి కాలువలో పిల్లలు ఇలా ఈతలాడారు..ఒంటి పూట బడులు కావడంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రంలో వరకూ కాల్వలోనే సేదతీరుతున్నారు..

-పోలవరం, (ఆంధ్రజ్యోతి)

డేంజరస్ !



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం

ఏలూరు నగరంలోని వెంకటాపురం పంచాయతీ కనకదుర్గమ్మ ఆలయ రోడ్డులోని మస్తాన్ మన్యం కాలనీ ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్ల సముదాయం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మార్జిన్‌లో ఉండడమే కాకుండా చిన్న పిల్లలకు సైతం విద్యుత్ వైర్లు అందే విధంగా బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని, పిల్లలకు అందకుండా విద్యుత్ వైర్లు ఎత్తుగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మినీ వంతెనల వద్ద దెబ్బతిన్న మార్జిన్లు



నగరంలోని పాతబస్టాండ్ సెంటర్, గూడ్స్ షెడ్డు రోడ్డు, రైల్వేస్టేషన్ సమీపంలోని తూర్పు లాకుల వద్ద ఏలూరు కాలువపై అటు నుంచి ఇటు నుంచి అటు రాకపోకలు సాగించేందుకు చిన్న వంతెనలను నిర్మించారు. వంతెనలు ఎక్కే, దిగే క్రమంలో మార్జిన్లు దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో దగ్గరకు వెళ్ళే వరకు గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఏలూరు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



కేబుళ్లతో కళా విహీనం



ఏలూరు నగరంలో గోడలకు అందమైన పెయింటింగ్స్ వేయించి సుందరంగా ఉండేలా తీర్చిదిద్దారు. నగరానికి వచ్చినవారికి ఇవి ఆహ్లాదంతో పాటు ఆనందం ఇస్తున్నాయి. అయితే వాటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల సంగతేంటి..? వాటికి చుట్టుకు పోయిన ఉన్న కేబుల్స్ మాటేంటి...? ఈ కేబుల్ చుట్టలు స్తంభాలకు వేలాడుతూ కళా విహీనంగా ఉన్నాయి. ఇంటర్నెట్, ఎంఎస్‌వో ఆపరేటర్ల కేబుల్స్ అన్నీ చుట్టలుగా స్తంభాలకు తగిలించడంతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఒక్కోసారి అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. నగరంలోని ఏ స్తంభం చూసినా కేబుల్ చుట్టలు కనిపిస్తున్నాయి. రోడ్డు మధ్యలో పైభాగం మీదుగా కేబుల్ వైర్లు వేస్తున్నారు. దీంతో ప్రమాదాలతో పాటు అస్తవ్యస్తమైన వాతావరణం నెలకొంది. అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను అమలు చేస్తే ప్రమాదాల నివారణతో పాటు నగరం సుందరీకరణంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఒక్కసారి కేబుల్ వైర్లు తెగి వాహన చోదకులపై కూడా పడుతున్నాయి..

- ఏలూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

శిశు గృహాలకు చిన్నారులు తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ధర్మం శరణం గచ్చామి (పిల్లలతో యాచక వ్యాపారం) ఫొటో వార్తకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పందించారు. తక్షణం పిల్లలను ఎక్కడ ఉన్నారో గుర్తించి ఆదుకోవాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య సిబ్బంది, పోలీస్ శాఖ పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలో చెత్త సేకరిస్తూ, భిక్షాటన చేస్తున్న తల్లితో పాటు నలుగురు బాలలను పోలీసులు గుర్తించారు. వీరిని తాత్కాలిక వసతి నిమిత్తం జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఆదేశాలపై శిశు గృహానికి తరలించారు.

చేతులు కాలుతున్నాయి స్వామీ..!

చిన వెంకన్న ఉచిత ప్రసాద వితరణ సిబ్బంది దురుసుతనం


బొబ్బలెక్కిన చేయిని చూపుతున్న ఏలూరుకు చెందిన భక్తురాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన ద్వారకాతిరుమల స్వామి వారి ప్రసాదాన్ని అందుకున్న భక్తుల చేతులు బొబ్బలెక్కుతున్నాయి.. భక్తులంటే చులకనగా భావిస్తున్న ప్రసాదాల వితరణ సిబ్బంది చేష్టలు మితిమీరుతున్నాయడనానికి ఇదొక ఉదాహరణ. వేడి వేడి ప్రసాదాన్ని ఓ చిన్న దొన్నెలో వేసి ఇవ్వడమే కాకుండా వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వామివారి దర్శనానికి బుధవారం వెళ్లి వచ్చిన భక్తులకు ఎదురైన చేదు అనుభవం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలూరుకు చెందిన ఓ భక్తుని కుటుంబం స్వామి వారి దర్శనానంతరం తూర్పుగోపురం పక్కనున్న ఉచిత ప్రసాదాలు అందించే షెడ్డులోకి వెళ్లారు, ప్రసాదాలు అందించే ఉద్యోగి విసుక్కుంటూ క్యూ లైన్లలో ఉండే వారి చేతిలో దొన్నెతో నింపిన ప్రసాదాన్ని హడావుడిగా ఇచ్చేస్తున్నాడు. అది చింది కొందరి చేతుల మీద కూడా పడింది. బాబోయ్... కాలిపోతోంది సార్ ! అంటున్నా వినకుండా క్యూలైను జరిపేస్తున్నాడు. ఇదేంటని కొందరు నిలదీస్తే వారిపై సదరు ఉద్యోగి విరుచుకుపడ్డాడు. "ఈ ప్రసాదం చల్లారాలంటే ఏడు గంటల పైనే పడుతుంది అప్పటి వరకూ ఉంటావా...ఉచితంగా ప్రసాదం ఇస్తుంటే తీసుకోకుండా ఏంటా ప్రశ్నలు" అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. అక్కడున్న ఓ వృద్ధురాలు, మరికొంత మంది సైతం చేయికాలి లబోదిబోమన్నారు. ఏలూరుకు చెందిన భక్తురా ఇంటికి వెళ్లిన తర్వాత చూసుకోగా చేయి బొబ్బలెక్కింది. శ్రీవారి దర్శనానంతరం ప్రసాదం స్వీకరించేందుకు వెళ్లే భక్తులకు ఆ ప్రసాదాన్ని అందజేసే వారి నుంచి ఛీత్కారాలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఆలయ అధికారులు ఇటువంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

నిప్పుల గుండం తొక్కిన భక్తులు


నిప్పుల గుండం తొక్కుతున్న ఆలయ చైర్మన్ దంపతులు

దెందులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం చల్లచింతలపూడి లో వెలసిన యలమర్తి వారి ఆడపడుచు గ్రామ దేవత పాటిమ్మ పేరంటాలమ్మ తల్లి జాతర ఉత్సవాల ఆఖరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నిప్పులగుడం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ దంపతులు యలమర్తి హేమలత, శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి నిప్పులగుండం తొక్కారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేవస్థానం కమిటీ సభ్యులు పావులూరి దశరథ రామయ్య, ముమ్మడి మోహన్‌రావు, సత్యనారాయణ, మోహన్ మురళీకృష్ణ, బోర్రాయ్య, రామయ్య, తదితరులు నిప్పుల గుండం తొక్కారు.



భద్రాచల రామయ్య కల్యాణానికి పాదయాత్రగా..

కుక్కునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారాముల కల్యాణం వీక్షించేందుకు వేలాది మంది భక్తులు పాదయాత్ర చేస్తూ తరలివెళ్తున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన భక్తులు గోటి తలంబ్రాలతో చిన్నా, పెద్దా అంతా జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ తరలివెళ్తున్నారు. గురువారం కుక్కు నూరులోని రామాలయం వద్ద శంకు బాబు అనే భక్తుడు వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఉప్పేరులో భక్తులకు భోజన వసతి కల్పించారు. ప్రతీ ఏటా వేలాది మంది భక్తులకు స్థానిక ప్రజలు మజ్జిగ అందిస్తున్నారు.

తాగే నీరు సురక్షితమేనా ?



- కలుషితమవుతున్న కాల్వలు, తాగునీటి చెరువులు
- పంచాయతీ కుళాయి నీటిపై ప్రజల్లో భయాలు
- వాటర్ ప్లాంట్ల నీరు వినియోగం
- విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్స్
- వేసవిలో జోరుగా వ్యాపారం
- ప్రమాణాలు పాటిస్తున్నారా..లేదా ?
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

నిడమర్రు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మనం తాగేనీరు సురక్షిత మేనా ? పంచాయతీ కుళాయి నీటి నుంచి ఆర్వో ప్లాంట్ల వరకు నీరు తెచ్చుకుని తాగేవారు అందరికీ సహజంగా వచ్చే సంశయమే ఇది.. కానీ సమాధానమే దొరకదు.. అసలే వేసవి కాలం.. ఎక్కడి కక్కడ దాహం కేకలు వినిపిస్తుంటాయి. మంచినీరు దొరికితే అదే మహా భాగ్యం అనుకుంటారు. గోదావరి జిల్లాల్లో కాల్వలు చెరువులు కలుషితమవుతున్నాయి.. కలుషిత నీటి కారణంగా డయేరియా, జ్వరం, నీళ్ల విరేచనాల , టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడుతున్నారు.ఆక్వా చెరువుల వల్ల తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. పంచాయితీల్లో ఫిల్టర్లు పనిచేయకపోవడంతో కాలువల్లో నీటినే తోడి కుళాయిల ద్వారా ఇవ్వడంతో ప్రజలు కుళాయి నీటిని తాగడం మానేశారు.ఇంటి అవసరాలకు మాత్రమే వాడుకొంటూ వాటర్ ప్లాంట్స్ నుంచి నీటిని కొనుగోలు చేసి తాగు తున్నారు. కానీ అవి ఎంతవరకు సేఫ్ ? ఎవరికి తెలుసు ?

విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్స్

పంచాయతీ కుళాయిల్లో సరఫరా అవుతున్న మంచినీటిపై నమ్మకం కోల్పోయిన ప్రజలు నేడు ప్రతి గ్రామంలోనూ ఆర్వో వాటర్ ప్లాంట్స్‌పై ఆధారపడుతున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 5 నుంచి 10 వరకు వాటర్ ప్లాంట్స్ వెలిశాయి. విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న వాటర్‌ప్లాంట్స్‌ను పర్యవేక్షించేనాథుడు లేక ఇష్టారా జ్యంగా సాగుతోంది. ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే స్థానికంగా గల మంచినీటి



చెరువు నీటిని, బోరు వాటర్‌ను ఫిల్టర్ చేసి సరఫరా చేస్తూ ప్రజల నుంచి డబ్బులు గుంజు కొంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సుమారు 2 వేల వాటర్ ప్లాంట్లు వెలిశాయి. ఏలూరు జిల్లా 28 మండలాల్లో సుమారు 400 నుంచి 500 వాటర్ ప్లాంట్లు పనిచేస్తున్నాయి.. పశ్చిమ గోదావరి జిల్లా మండలాలు 20 మండలాలు ఉండగా 500 నుంచి 600 ఆర్వో ప్లాంట్లు నీటిని అందిస్తున్నాయి.. వీటిని పర్యవేక్షించే నాథుడే లేరు.

వేసవిలో జోరుగా వ్యాపారం

ప్రస్తుతం వేసవిలో ఎండల వల్ల మంచినీళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతిఒక్కరూ ఇష్టారాజ్యంగా బోరువేయడం చిన్న మిషనరీ తేవడం, ఆర్‌వో వాటర్, ఫౌండేషన్ పేరుతో పంపిణీ చేసి మంచినీళ్లతో వ్యాపారం చేస్తున్నారు. కొన్నిచోట్ల గ్రామ పంచాయితీ మంచినీటి చెరువులోనే పైప్ కనెక్షన్ ఇచ్చి 15 లీటర్లు టిన్ను 10 రూపాయల నుంచి రూ.20 కు అమ్ము తున్నారు. ఆర్‌వో ప్లాంట్స్‌పై సరైన పర్యవేక్షణ ఉన్న దాఖలాలు కానరావడం లేదు. ఆర్వో నీరు పేరుతో గ్రామాల్లో వేలల్లో సంపాదిస్తుండగా పట్టణాల్లో అయితే లక్షల్లో సాగుతోంది.

ఈ నిబంధనలు పాటిస్తున్నారా ?

- రివర్స్ ఆస్మోసిస్ వాటర్ ప్లాంట్ (ఆర్‌వో ప్లాంట్) నిర్వహిం చడానికి ప్రభుత్వ లైసెన్స్ తప్పనిసరి. దీనితోపాటు నీటి నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించడం, పర్యావరణ ప్రమాణాలు పాటించడం, భద్రతా చర్యలు తీసుకోవడం వంటి చర్యలు తప్పనిసరిగా పాటించాలి.
- వాణిజ్యపరమైన ఆర్వో వాటర్‌ప్లాంట్ నిర్వహించాలంటే తప్ప నిసరిగా చిన్నతరహా పరిశ్రమగా నమోదు చేసుకోవాలి.భారత ఆహార భద్రత ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రం పొంది ఉండాలి.
- ఆర్వో ప్లాంట్ సరఫరా చేసే నీరు బీఐఎస్ ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయబడి ఉండాలి. నీటి నాణ్యత ప్రమాణాల్లో భాగంగా ముడి, శుద్ధి చేయబడిన నీటి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి వాటిని ప్రదర్శించాలి.
- ఫిల్టర్ చేసిన నీటి టీడీఎస్ (టోటల్ డిసాల్వ్ సాలిడ్స్) స్థాయి ఆమోదయోగ్యమైన పరిధిలో 80 నుంచి 150 ఎమ్‌జి-ఎల్‌లో ఉండేలా చూసుకోవాలి.
- నీటి పీహెచ్ స్థాయి, నీటి ఉష్ణోగ్రత స్థాయి, నీటి కాఠిన్యం, సిల్ట్ డెన్సిటీ ఇండెక్స్ , అవశేష క్లోరిన్, ఐరన్ కంటెంట్, సిలికాన్ స్థాయి, వాటర్ రికవరీ రేటులను యాజమాన్యం, అధికారులు తప్పక పర్యవేక్షిస్తూ ఉండాలి.

ప్రభుత్వం పట్టించుకుంటున్నదా ?

రాష్ట్రంలో రాష్ట్ర నీరు, భూమి, చెట్లు అథారిటీ సంస్థ ఈ ఆర్‌వో వాటర్ ప్లాంట్లను పర్యవేక్షిస్తున్నది. ఉన్నతాధికారులు కానీ, మండల స్థాయి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కానీ, గ్రామ పంచాయతీ సచివాలయ సిబ్బంది కానీ ఈ వాటర్ ప్లాంట్స్‌ను పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవు. మొక్కుబడి తనిఖీలతో, మామూళ్ల మత్తులో కాలం గడుపుతున్నట్లు తెలుస్తున్నది. ఆర్‌వో ప్లాంట్స్ నీరు సురక్షితమేనా అన్న భావన ప్రజల్లో నెలకొంది. గృహ అవసరాలకు, వివాహ కార్యక్రమాలు, ఫంక్షన్లకు ఆర్వో వాటర్‌నే వాడుతున్నారు.

• ప్లాంట్ల వద్ద నీటి ప్రమాణాల బోర్డు ప్రదర్శించాలి



విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న ఆర్వో వాటర్‌ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ కరవడింది. నీటి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న విషయం స్థానికులకు కూడా తెలియడం లేదు. ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకొని కొన్ని వాటర్‌ప్లాంట్ల వారు బోరు నీటినే డైరెక్టుగా అమ్ముతూ సొమ్ము చేసుకొంటున్నారు. జిల్లా స్థాయి అధికారుల దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డ్రైవ్ నిర్వహించి ప్రతి ఆర్‌వో ప్లాంట్స్ సందర్శించి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలి. నీటి నాణ్యతా ప్రమాణాల బోర్డును ఆయా ఆర్వో ప్లాంట్ల వద్ద ప్రదర్శించాలి. అప్పుడే ప్రజలకు నమ్మకం కల్గుతుంది.

సంకు నాగ శేషు, వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా కన్వీనర్, ఏలూరు

• పంచాయతీ అధికారులు తనిఖీలు చేయాలి



తాగునీటి కోసం ఎక్కువ శాతం మంది ఆర్వో ప్లాంట్లపై ఆధారపడు తున్నారు. నిర్వాహకులు నిబంధనలు సరిగా పాటించడం లేదు. వాటిపై సరైన పర్యవేక్షణ లేదు. పంచాయతీ అధికారులు ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసి నియమ నిబంధనలు పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించాలి. స్థానిక ప్రజలకు అధికారులు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

షేక్ రంగావళి, ఉపాధ్యాయుడు, శాంతి నగర్, ఏలూరు


తహసీల్దారు కార్యాలయం ఆవరణలో డాగ్ , బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

పోలవరం ప్రభుత్వ కార్యాలయాల్లో
డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

పోలవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో జిల్లా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మావోయిస్టుల భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరుగుతున్నట్లు భావిస్తున్నారు. ఈ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందంలో పీసీలు రాపాక నవీన్, డాగ్ హ్యాండ్లర్ రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

దొడ్డనపూడిలో వైసీపీ నేత హవా చోద్యం చూస్తున్న అధికారులు



ఆక్రమణపై మూడేళ్ల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

దొడ్డనపూడిలో ఆర్ఎస్ నెం. 205/1ఏ లో సుమారు 90 సెంట్లు, 1బీలో సుమారు 50 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిపై సరిహద్దు రైతు, వైసీపీ నేత కన్నువేశాడు. అప్పట్లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ

మూడేళ్లుగా కబ్జా ప్రయత్నాలు

భూమి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. రెవెన్యూ అధికారుల అండతో తన పొలాన్ని చెరువుగా మార్చుకునే సమయంలో ఈ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తేవడంతో 2022 డిసెంబర్ 8న 'దర్గాగా.. కబ్జా' శీర్షికన ప్రచురితమైన కథనంతో అధికారులు కదిలారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయి అధికారులు కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి తవ్వకం పనులు నిలిపివేశారు. అప్పటికే మూడుసార్లు చెరువు తవ్వకానికి ప్రయత్నించారని తెలియడంతో మరొకమారు తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అప్పటి తహసీల్దార్ టిపి కృష్ణారావు హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడిన 'ఆంధ్రజ్యోతి'కి అప్పట్లో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కాళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏదైనా అధికార, ఆర్థిక బలం ఉంటే అడ్డుకునేది ఎవరంటూ స్థానిక వైసీపీ నేత దర్జాగా ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. చెరువు తవ్వకం చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేత హవా కొనసాగుతోందని నాయకులు మండి పడుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తున్నారని, కబ్జా వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళతామని గ్రామస్థులు చెబుతున్నారు.

మరోసారి ఆక్రమణ యత్నం!

దాదాపు రెండున్నరేళ్లపాటు ఖాళీగా ఉన్న భూమిపై మరోసారి వైసీపీ నేత ఆక్రమణకు రంగం సిద్ధం చేశారు. స్థానిక అధికారులను ప్రసన్నం చేసుకుని పది రోజులుగా గట్లను ఎత్తు చేసుకునే పనిలో ఉన్నారు. రోడ్డున వెళ్లేవారికి పనులు కనిపించకుండా, ఎవరూ తన గట్టుకు రాకుండా ఒక గేటు ఏర్పాటు చేసి తాళం కూడా వేశాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు అటువైపు కూడా చూడడం లేదని గ్రామస్థులు మళ్లీ 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ అధికారులను వివరణ కోరడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకిరణ్, స్థానిక వీఆర్వో చిట్టిబాబు ఆక్రమణ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు నిలిపివేశారు. మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో గట్టు వేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. భూమిని గతంలోనే తాము కొనుగోలు చేశామని, దానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని సదరు నేత తెలపడంతో తహసీల్దార్‌కు చూపాలని అధికారులు తెలిపారు. ఇదే భూమిని గతంలో తవ్వుతుండగా ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు మూడుసార్లు నిలుపుదల చేయడం గమనార్హం. ఆన్‌లైన్ అడంగళ్‌లో ప్రభుత్వ పోరంబోకుగా ఉందని, దీనికి పట్టా ఎలా ఇచ్చారు..? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో చెత్త వేసుకోవడానికి డంపింగ్ యార్డ్ లేదని, ఇలాంటి ప్రభుత్వ భూములను గ్రామ అవసరాలకు వినియోగించుకుంటే బాగుంటుందని కొంత మంది గ్రామస్థులు కోరుతున్నారు.


ప్రభుత్వ భూమిలో తవ్వకం పనులు

జాలిపూడి డ్రెయిన్‌పై ఆక్రమణలు!

ఏలూరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని జాలిపూడి డ్రెయిన్‌పై ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఈ డ్రెయిన్ ద్వారా చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి తదితర ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. కొన్నేళ్లుగా డ్రెయిన్‌పై ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరికి అనువుగా వారు ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. వాహనాలు వెళ్లేవిధంగా చిన్న వంతెనలను సైతం నిర్మాణాలు చేపట్టినా అధికారులు చోద్యం చూస్తున్నారు. జాలిపూడి డ్రెయిన్ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అడుగడుగునా చెత్తాచెదారం పేరుకుపోయి రబీ, ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూడు, చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించాలని, ఆక్రమణలను నిలువరించాలని రైతు సంఘాల నాయకులు ఆందోళన చేసినా ఫలితం లేదు. ఆక్రమణలపై అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా కోఆర్డినేటర్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం నుంచి 28 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. జంగారెడ్డిగూడెం కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ పి.సుబ్రహ్మణ్యం గురువారం వివరాలు తెలిపారు. మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ప్రతీ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మూడు గంటల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలో కూడా కోచింగ్ ఇస్తామని ఆయన తెలిపారు. కోచింగ్ అనంతరం ఏప్రిల్ 28న గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు కోచింగ్‌తో పాటు ఉచిత మెటీరియల్ అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్‌కు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న పాలిసెట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అధ్యాపకులు ఎస్ఎస్ఆర్‌ప్రసాద్, బి.రమేష్, కె.కేశవ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సీటీ స్కాన్


రోగికి సీటీ స్కాన్ తీస్తున్న దృశ్యం

నెల రోజుల తర్వాత అందుబాటులోకి..

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నెల రోజుల తర్వాత సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మరమ్మతు అనంతరం గురువారం యథావిధిగా పని చేస్తుంది. మార్చి 1న సీటీ స్కాన్ మిషన్‌లోని ట్యూబు పోవడంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులు మరమ్మతు చర్యలు చేపట్టారు. సుమారు రూ.25 లక్షల విలువైన ట్యూబు బుధవారం సాయంత్రానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది. ఇంజనీర్లు కొన్ని గంటల పాటు మరమ్మతులు నిర్వహించి ట్యూబ్‌ను అమర్చారు. రోగులకు గురువారం ఉదయం నుంచి సీటీ స్కాన్ తీస్తున్నారు. గురువారం ఒక్కరోజే 42 స్కాన్‌లను తీశారు. ప్రభుత్వాసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు పూర్తిగా ఉచితం. ప్రభుత్వాసుపత్రి ఓపీ విభాగంలో కాని ఇన్‌పేషెంటుగా ఉన్న వారికి సంబంధిత ఆసుపత్రి వైద్యుల సూచన మేరకు స్కానింగ్‌ను తీస్తున్నారు. సీటీ స్కాన్ అందుబాటులోకి రావడంతో రోగులకు ఖర్చు, సమయం కలిసి వచ్చింది.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆర్‌బీఐ సేవలు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

భీమవరంటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆర్‌బీఐ సేవలందిస్తుందని యూనియన్ బ్యాంక్ భీమవరం శాఖ చీఫ్ మేనేజర్ ఎం.నిర్మల జ్యోతి అన్నారు. 90 ఏళ్ల క్రితం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించబడిందన్నారు. యూబీఐలో గురువారం ఆర్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఆర్‌బీఐ ప్రారంభంలో ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నప్పటికీ 1949లో జాతీయం చేయబడిందని, అప్పటి నుంచి భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధీనంలోకి వచ్చిందన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నోట్ల జారీలో ఆర్‌బీఐ గుత్తాధిపత్యాన్ని కలిగి ఉందన్నారు. బ్యాంక్ విధి విధానాలపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్.వెంకన్నబాబు, కె.పార్వతి, వి జ్ఞాన కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బియ్యం లోడుతో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ తనిఖీల్లో రేషన్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అధికారి వి శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ వి.ప్రసాద్ కుమార్, ఎస్ఐ కె.నాగరాజు, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత చాట్రాయిలో నిఘా పెట్టారు. ఏపీ 39యుజడ్2685 నెంబర్ గల మినీ లారీలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుండగా విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్ చప్పిడి వెంకటకృష్ణను ప్రశ్నించగా ఆ బియ్యం నాగరాజు కృష్ణ శివదీప్ నకు చెందినవని వివరించాడు. చాట్రాయి పరిసర ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కోళ్ల ఫారాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.6 లక్షలు ఉంటుందన్నారు. వ్యాన్‌తో సహా బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. మాదరాజు కృష్ణ శివదీప్, చప్పిడి వెంకట కృష్ణ, లారీ యజమాని కె మహేశ్వర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గోపవరంలో బంగారు ఆభరణాలు అపహరణ

కైకలూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. కైకలూరుటౌన్ ఎస్సై ఆర్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం గోపవరం గ్రామానికి చెందిన గూడురు వెంకట లక్ష్మీనాగేశ్వరరావు గత నెల 23న ఇంటికి తాళం వేసి విశాఖపట్నంలో ఆయన కుమార్తె వద్దకు వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి రాగా తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వి కృష్ణ, ఎస్సై ఆర్.శ్రీను పరిశీలించారు. అనంతరం క్ల్యూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకల్యం అధిగమించాలి

- ప్రత్యేక అవసరాలు గల 852 మందికి ఉపకరణాల పంపిణీ
- రాష్ట్రంలో ఏలూరు జిల్లా నుంచే శ్రీకారం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వైకల్యాన్ని అధిగమించి ముందుకు సాగాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలుగల పిల్లల (సీడబ్ల్యుఎస్ఎన్)కు ప్రభుత్వం సరఫరా చేసిన ఉపకరణాలను గురువారం వారు అందజేశారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో తొలిసారిగా ఏలూరు జిల్లా నుంచే ప్రారంభించారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వైకల్యంతో ఉన్న 928 మందిని బాలబాలికలను గుర్తించారు. వారిలో 852 మందికి ఉపకరణాలు అవసరమని ఎంపిక చేశారు. కలెక్టర్ వెట్రిసెల్లి మాట్లాడుతూ ఏకకాలంలో 852మందికి ఉపకరణాలు అందజేసి ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తోన్న భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టులు, ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సమాజంలో అందరితో సమానంగా ఎదిగేలా ప్రభుత్వపరంగా అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకోసం సీపీ చైర్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, టీఎల్ఎం కిట్లు అందజేసిందన్నారు. రూ.75లక్షలు ఖరీదుచేసే ఉపకరణాలను జిల్లాలోని ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా పంపిణీ చేశామన్నారు. సమగ్రశిక్ష విలీనవిద్య జిల్లా కోఆర్డినేటర్ భాస్కరరాజు మాట్లాడుతూ మీరట్‌కు చెందిన అలింకో కంపెనీ తయారుచేసిన ఉపకరణాలపై సంబంధిత విద్యార్థి ఆధార్ నెంబర్‌తో కూడిన క్యూఆర్ కోడ్ ఉంటుందని, వీటికి రెండేళ్లపాటు గ్యారెంటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, అలింకో సంస్థ ప్రతినిధులు, బాలబాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బ్యాటరీ ట్రైసైకిల్ పనితీరుపై డెమో పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి

నలుగురు నకిలీ పోలీసుల అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నలుగురు యువకులు ముఠాగా ఏర్పడ్డారు. ఒకరు పోలీసు యూనిఫామ్‌లో ఉంటారు. మిగిలిన ముగ్గురు మఫ్టీ పోలీసులుగా చెప్పుకుంటారు. రాష్ట్రీయ రహదారిపై టీ కొట్టు యజమానిని బెదిరించి రూ.వెయ్యి వసూలు చేశారు. అంతలో హైవే పెట్రోలింగ్ వాహనం రావడంతో పారిపోయారు. నలుగురు నకిలీ పోలీసులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఏఎస్పీ తెలిపారు.

భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన బుంగా ప్రశాంతకుమార్, పోలీస్ యూనిఫాం ధరించగా పెరికే సురేంద్ర కుమార్ లాఠీ చేతపట్టుకున్నారు. ఉంగుటూరుకు చెందిన గొల్లా సురేష్‌కుమార్, పూళ్ళ గ్రామానికి చెందిన కొరపాటి రోహిత్ కలిసి ఈనెల 1న రాత్రి 11.30 గంటలకు టీ దుకాణం వద్దకు వచ్చారు. పోలీసులమని షాపు ఎందుకు తెరచి ఉంచావని అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని బెదిరించి వెయ్యి రూపాయలు ఇస్తే వదిలేస్తామని చెప్పారు. అదే సమయంలో అటుగా వస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులను చూసి నకిలీ పోలీసులు పారిపోయారు. ద్వారకా తిరుమలకు చెందిన టీ దుకాణం నిర్వాహకుడు మాంద్రు డేవిడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ వి.సుధీర్ సిబ్బంది కలిసి నిఘా ఏర్పాటు చేశారు. నకిలీ పోలీ సులు నలుగురిని భీమడోలు జంక్షన్ వద్ద గురువారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించారు. టీ దుకాణం వద్ద బెదిరించి వెయ్యి రూపాయలు తీసుకున్న ముఠా వారేనని గుర్తించారు. చెడువ్యసనాలకు బానిసలైన వీరు ఏలూరులోని పోలీస్ యూనిఫామ్ కుట్టే టైలర్ వద్ద యూనిఫామ్ కుట్టించుకుని నకిలీ పోలీసులుగా అవతారం ఎత్తారని గుర్తించారు. వారి నుంచి కారు, పోలీస్ యూనిఫామ్, లాఠీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ వి సుధీర్ పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు చెబుతున్న ఏఎస్పీ

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఉంగుటూరు మండలం చిన వెన్నపల్లి గ్రామానికి చెందిన యాంద్ర నాగేశ్వరరావు (65) గురువారం ఉదయం ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయం భీమవరం యువకుడి అరెస్టు

బంజారాహిల్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ విక్రయిస్తున్న భీమవరం యువకుడిని హైదరాబాద్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 11 తాడిపత్రి బిర్యానీ సెంటర్ వద్ద డ్రగ్స్ అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మఫ్టీలో నిఘా పెట్టారు. ఓ యువకుడు ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అతడి వద్ద 7 గ్రాముల కొకైన్, 3.7 గ్రాముల ఎక్‌టసీ పిల్స్ లభించాయి. అతడిని ప్రశ్నించగా పెడ్లర్ వద్ద కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కోపర్తి సాయిమణికంఠ అని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. యువకుడి వద్ద మత్తుపదార్థాలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.


లక్కవరం ఎర్ర కాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు, పర్యవేక్షిస్తున్న ఎస్ఐ శశాంక

ఎర్రకాలువలో రైతు గల్లంతు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లక్కవరం గ్రామానికి చెందిన రైతు చల్లా బసవయ్య (70) పశువులను మేపడానికి వెళ్లి ఎర్రకాలువలో పడి గల్లంతయ్యాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరం గ్రామానికి చెందిన చల్లా బసవయ్య ప్రతీ రోజు పశువులను మేపి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తాడు. గురువారం సాయంత్రం పొలంలో పశువులు మాత్రమే వస్తుండడంతో స్థానికులు ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. వెతికారు. ఎర్రకాలువ ఒడ్డున బసవయ్య చెప్పులు, టవల్, కర్ర ఉండడంతో పశువులను కడగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడని భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో రాత్రి పొద్దు పోయేవరకు గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ లభ్యం కాలేదు. లక్కవరం ఎస్సై శశాంక సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు పర్యవేక్షించారు.

ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాద స్థలంలో ఆటో, బైక్

పెనుమంట్ర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర శివారు బ్రాహ్మణ చెరువు వద్ద మార్టేరు రహదారిపై గురువారం ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రావులపాలెం నుంచి ఆకివీడు వెళుతున్న ఆటో ఆగిఉన్న మరో ఆటోను ఢీకొని అదుపుతప్పి మోటార్ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొంది. ఈ సంఘటనలో మోటార్ సైక్లిస్ట్ సత్యనారాయణ, ఆటో డ్రైవర్ గాయపడ్డారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని..

ఆచంట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎ.వేమవరం వద్ద గురువారం ట్రాక్టర్, ఆటో ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న యర్రగొప్పుల శారద, గంధం శ్రీనివాస్ గాయపడడంతో పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు.

'నన్నయ'లో క్యాంపస్ డ్రైవ్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో గురువారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. 83 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ టి.అశోక్ తెలిపారు. దివిస్ లేబరేటరీస్ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీఫార్మసి, ఎం ఫార్మసి, బీఎస్సీ, ఎంఎస్సీ ప్రోగ్రాం విద్యార్థుల కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.

దూబచర్ల 'డైట్'లో అధ్యాపకుల నియామకాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దూబచర్లలోని 'డైట్'లో వివిధ విభాగాల్లో ఖాళీగావున్న 6 సీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా డిప్యూటేషన్ (ఎఫ్ఎస్‌టీసీ) ప్రాతిపదికన భర్తీ చేసే పోస్టులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎంఈవోలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి గురువారం తెలిపారు. ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని, 16, 17 తేదీల్లో రాతపరీక్ష, 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. నోటిఫికేషన్ వివరాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో ఉందన్నారు.

జడ్పీ సమావేశం వాయిదా

ఏలూరు సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశం, స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 4న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో కె భీమేశ్వర్ గురువారం తెలిపారు. తిరిగి సమావేశం జరిగే తేదీ త్వరలో తెలియజేస్తామన్నారు.

5న భద్రాచలం బస్సులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భీమవరం డిపో నుంచి 5న భద్రాచలంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ తెలిపారు. 5న శనివారం కొత్త బస్ కాంప్లెక్స్ నుంచి నడుపుతాయమని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. టికెట్టు ధర రూ.410 నిర్ణయించామన్నారు. భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులపై కేసు

తాడేపల్లిగూడెం క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారయత్నం ఘటనపై అసత్య ప్రచారాలు చేసిన యూట్యూబ్ చానల్ నిర్వాహకులపై పట్టణ పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన బాలికకు జరిగిన అన్యాయంపై గత నెల 31న ఒక యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు వీడియో ప్రసారం చేశారు. బాలిక వివరాలను బహిర్గతం చేశారు. ఆమె తండ్రి పట్టణ పోలీసులను ఆశ్రయించగా సీఐ సుబ్రహ్మణ్యం ముగ్గురిపై పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

8 మందికి గాయాలు

ఆచంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రధాన సెంటర్లలో సైతం కుక్కలు గుంపులు గుంపులుగా వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. ఆచంటలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారంతో 8 మంది గాయపడ్డారు. వారికి సీహెచ్‌సీలో చికిత్స చేశారు. ఆచంటలో పిచ్చి కుక్కను పట్టుకుని వీధి కుక్కలను కూడా నిరోధించాలని కోరుతు ఆచంటకు చెందిన బాధితుడు సింహాచలం స్థానిక పంచాయతి కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలను ప్రమాదంలో పెట్టినట్టే..

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే తమ ప్రాణాలను చేతులారా ప్రమాదంలో పెట్టినట్టేనని ఏలూరు మోటారు వాహన తనిఖీ అధికారి రమేష్‌బాబు అన్నారు. జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై వెళ్లే ద్విచక్ర వాహనదారులను ఆపి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

మహాత్మా గాంధీ భవన సందర్శనకు అనుమతి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల్లో విద్యార్థుల సందర్శన నిమిత్తం నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవనాన్ని తెరిచి ఉంచుతామని జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు భవనాన్ని సందర్శించవచ్చన్నారు. గాంధీజీ జీవిత చరిత్ర ఘట్టాలు, దేశంకోసం పోరాడి అమరులైనవారి ఫోటోలు తిలకించవచ్చునన్నారు. పార్లమెంటు నమూనాలో ఈ భవనం నిర్మించినట్టు తెలిపారు.

అభివృద్ధికే అగ్రతాంబూలం : ఎమ్మెల్యే చంటి


రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబులం ఇస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శాంతి నగర్‌లో రూ.4 కోట్లతో నూతనంగా నిర్మించే రోడ్డుకు ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో పాడైన రోడ్లను పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, కె.సాంబశివరావు, వందనాల శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి, గూడవల్లి వాసు పాల్గొన్నారు.

కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : గిగ్ వర్కర్స్, ప్లాట్ ఫాం వర్కర్లు ఇతర కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. వర్కర్లు కార్మికులు ఈశ్రం పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధార్, ఫాన్ నెంబర్లు కలిగి ఉండాలన్నారు. కార్మికుల వయస్సు 16 - 59 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. జమోటో, స్విగ్గీ, వోలా, ఊబర్, రాపిడో కార్మికులను గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ అంటారన్నారు. వీరంతా గ్రామ, వార్డు సచివాయాలు, సీఎస్‌సీ సెంటర్లలో నమోదు చేసుకోవాలన్నారు.

అడవుల అభివృద్ధికి కృషి చేయాలి : చలపతిరావు


టేకును పరిశీలిస్తున్న దృశ్యం

జీలుగుమిల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : అడవుల అభివృద్ధి, పెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పీసీసీఎఫ్(ప్రిన్సిపుల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు) పి.వి.చలపతిరావు(మంగళగిరి) పేర్కొన్నారు. రమణక్కపేట వద్ద రీసెర్చ్ టేకు ప్లాంటేషన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ప్లాంటేషన్‌లో పెరుగుదల టేకు చెట్ల పొడవు వెడల్పును పరిశీలించారు. ప్లాంటేషన్ వివరాలను జిల్లా అటవీశాఖ అధికారి శుభం నుంచి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య, జంగారెడ్డిగూడెం రేంజ్ అధికారి దుర్గా కుమార్, డీఆర్వో ధర్మారావు, ఎఫ్‌బీవోలు మారేష్, లలిత కుమారి ఉన్నారు.

జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ అత్త అచ్చాయమ్మ మృతి


అచ్చాయమ్మ(ఫైల్)

పెదపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అత్తగారు, టీడీపీ నాయకులు ఘంటా ప్రసాదరావు మాతృమూర్తి ఘంటా అచ్చాయమ్మ గురువారం ఉదయం సత్యవోలులోని వారి స్వగృహంలో మృతి చెందారు. జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను జడ్పీ సీఈవో కె.భీమేశ్వరరావుతో పాటుగా పలువురు జడ్పీ ఉన్నతాధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది కలిసి సానుభూతిని తెలిపారు.

ఆర్అండ్‌బీ రోడ్లకు నిధులు మంజూరు

చింతలపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ఆర్అండ్‌బీ రోడ్లకు నిధులు మంజూరైనట్టు ఆర్అండ్‌బీ ఏఈ ఎస్.సుందరరావు తెలిపారు. చింతలపూడి - గురుభట్లగూడెం ఏడు కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు మూడు కోట్ల రూపాయలు, యర్రగుంటపల్లి-లక్ష్మీపురం రోడ్డు నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు, చింతలపూడి నుండి రావికంపాడు రోడ్డు మరమ్మతులకు రెండు కోట్ల రూపాయలు మంజూరైనట్టు తెలిపారు. చింతలపూడి పట్టణం రోడ్ల ఇరు వైపులా చెట్లను ఆక్రమణదారులు చెట్లను ఆసరాగా చేసుకుని రోడ్లను ఆక్రమించడం ద్వారా ప్రమాదకరమైన సంఘటనలు జరుగుతున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు తెలియచేసినట్టు తెలిపారు.

రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాడాలి


మాట్లాడుతున్న నాయకురాలు వనజ

చింతలపూడి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు తీవ్ర నష్టం జరుగుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సీపీఐ మండల 13వ మహాసభ స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో జరిగింది. జెండా ఆవిష్కరణ అనంతరం ఆమె మాట్లాడుతూ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. దేశంలో వైద్యం కార్పొరేట్ పరమైందని, విద్యుత్ కష్టాలు పెరిగా యని, భవిష్యత్తులో వీటిపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు మన్నవ కృష్ణ చైతన్య, ఎం.వసంతరావు, టి.బాబు, ఎస్.కె.కాలేషా, కె.బుచ్చిబాబు పాల్గొన్నారు.

టెక్నీషియన్ కోర్సులపై ఉచిత శిక్షణ

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు మెకానిజంపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి గురువారం తెలిపారు. ప్రధాన మంత్రి కౌశిక్ వికాస్ యోజన కింద ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండీషనర్స్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. పదవ తరగతి, ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18-35 ఏళ్ళలోపు వారు అర్హులని తెలిపారు. ఈ నెల 11వ తేదీలోగా 94934 82414 నెంబర్‌లో వివరాలు తెలియజేయాలని తెలిపారు.

పెదపాడు మండలంలో...

పెదపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : రిఫ్రిజిరేటర్, ఏసీ మెకానిజంపై 45 ఏళ్లలోపు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు యూనియన్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, మూడు ఫొటోలతో (99485 65256, 90140 40780) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

లైట్లు, సౌండ్ బాక్సులను తొలగించండి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఆటోలు, ఫోర్ వీలర్స్, టు వీలర్స్‌కు ఎల్ఈడీ లైట్లు అమర్చి వాడుతున్నారని అలాంటి వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని జిల్లా రవాణాశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్‌కు గురువారం అందించారు. కొంత మంది పాసింజర్ ఆటోలు, ట్రక్కు ఆటోలు, చిన్న వ్యానులు, స్టీరియో బాక్సులను పెట్టుకుని పెద్ద పెద్ద శబ్దాలతో వెళ్తున్నారని నగరంలో ప్రతి రోజు ఎక్కడోచోట వీటి వల్ల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. తక్షణం వీరిపై చర్యలు తీసుకోవాలని షరీఫ్ డీటీసీని కోరారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

కామవరపుకోట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా సెట్‌వెల్ విభాగం, కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సరైన మార్గంలో పయనిస్తూ వ్యక్తిత్వ వికాసాన్ని రూపొందించుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రవర్తనతో పాటు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సెట్‌వెల్ మేనేజర్ పి.వి.ఎస్.సత్యనారాయణ, ఉపాధి కల్పనాధికారి జి.ప్రవీణ్‌కృష్ణ, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకట నారాయణ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని జిల్లా మున్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏలూరుకు చెందిన న్యాయవాది ఎ.వెంకటనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణ గతంలో ఏలూరు కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా పనిచేశారు. జిల్లా ప్రధాన న్యాయస్థానానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నారాయణ మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ఈ మేరకు ఆయనను పలువురు న్యాయవాదులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

మూడో కన్ను..

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.. పంచాయతీల్లో ఏర్పాటు చేసినా నిర్వహణ శూన్యం..


లింగపాలెంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

లింగపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : మనభద్రత మనచేతుల్లోనే అనే నినాదంతో పోలీస్ శాఖ ప్రధాన రహదారులు, ఇళ్లు, షాపులు, ప్రధాన కూడళ్లు, ఇలా ఎన్నో చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతలో ఇవి కీలక పాత్రపోషిస్తున్నాయి. వీటి సహకారంతో గ్రామాల్లో నేరాలు తగ్గుముఖం పట్టాయని పోలీసులు చెబుతున్నారు. లింగపాలెం మండలంలో 22 గ్రామ పంచాయితీలు ఉండగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. భారీవాహనాలు, కోతుల సంచారంతో పాటు అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణా లోపంతో కొన్నిచోట్ల సీసీ కెమెరాలకు అనుసంధానమైన వైర్లు తెగిపోయాయి. సీసీ కెమెరాల పనితీరుపై అధికారులు సమీక్షించి సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆయా పంచాయతీల అధికారులను ప్రజలు కోరుతున్నారు. ప్రతిచోటా సీసీ కెమెరాల ప్రాధాన్యత పెరుగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతి ఒక్కరూ తమ షాపులు, ఇళ్లు, కంపెనీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

సీసీ కెమెరాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నాం..



శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో పాటు సీసీ కెమెరాలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార కేంద్రాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాల వలన ప్రయోజనాలు, నష్టాలు గురించి అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

కె.వెంకన్న, ఎస్.ఐ. ధర్మాజీగూడెం


పరింపూడి సచివాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం

కొయ్యలగూడెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : పోలవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం మండలంలోని పరింపూడి పంచాయతీలో సచివాలయ ప్రారంభోత్సవం, బీసీ కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవం, తాగునీటి ట్యాంకులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఎంపీపీ గంజిమాల రామారావు, మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి, టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకట రమణ, జనసేన జిల్లా నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మండల బీజేపీ అధ్యక్షుడు గొలిశెట్టి వాసు, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, ఎంపీడీవో కిరణ్, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యం

పెదవేగి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దగ్గిరాల క్యాంపు కార్యాలయంలో విద్యుత్, రెవెన్యూ, సర్వే అధికారులతో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాలకు ఉచిత సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం ప్రభుత్వం రూ.100 కోట్లతో 14 మెగావాట్ల భారీ సోలార్ పవర్ ప్రాజెక్టుకు చర్యలు చేపట్టిందన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని 14వేల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు సౌర విద్యుత్ అందించే విధంగా ఆయా గ్రామాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈ కె.ఎం.అంబేడ్కర్ పాల్గొన్నారు.

సమర్థమైన విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలో 5,840మెగా ఓట్ల సామర్థ్యంతో 8 సూపర్ క్రిటికల్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. పార్లమెంట్‌లో మహేశ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర విద్యుత్ మంత్రి శ్రీపాద నాయక్ సమాధానమిచ్చారు. దేశంలో 2025 మార్చి నాటికి 98సూపర్ క్రిటికల్ యూనిట్లు 68070 మెగావాట్లు అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రంలో థర్మల్ పవర్ ప్లాంట్ల ఇంధన సామర్థ్యాన్ని, ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెదవేగి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : వట్లూరు నుంచి జానంపేట వరకు ఉన్న విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. భోగాపురం, కొప్పాక విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని భోగాపురం, అమ్మపాలెం, పెదకడిమి, కొప్పాక, అంకన్నగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఒంటిగంట వరకు విద్యుత్ నిలిపివేత..

కుక్కునూరు : మండల పరిధిలోని కుక్కునూరు, అమరవరం, సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం ఈ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.



ఏలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్ల పొట్టకొట్టొద్దు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : రాపిడో, ఉబర్, వోలా సంస్థలను వ్యతిరేకించాలని ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి మాట్లాడుతూ ఆటో స్టాండ్‌ల్లో సీరియల్ పద్ధతిన వేచి ఉంటూ కిరాయిలు వచ్చే సమయానికి రాపిడ్ వంటి సంస్థల వాహనాలు ప్రయాణికులను తరలించుకుపోవడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాద కంపెనీలైన రాపిడో వంటి విదేశీ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతినివ్వడం దుర్మార్గమన్నారు. ఏళ్లతరబడి ఏలూరు నగరంలో ప్రయాణికులకు సురక్షిత ప్రయాణ సేవలను అందిస్తున్నట్టు ఆటో డ్రైవర్లు తెలిపారు. నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లకు రక్షణ కల్పించేలా సమగ్ర సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు నారాయణపురంలో జాబ్ మేళా

ఉంగుటూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా మేళా నిర్వహించనున్నారు. దివీస్ లేబరెటరీ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు నేషనల్ కెరియర్ సర్వీస్ అథారిటీ అధికారి గట్టిం ప్రవీణ్ కుమార్ తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా గంగానమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న చింతమనేని

దెందులూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : దోసపాడు గ్రామ దేవత గంగానమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ ప్రతాప్ శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరించారు. అనంతరం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండలాధ్యక్షుడు మిల్లు బాబు, మోతుకూరి నాని లతో కలిసి గంగానమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత మనేనిని ఘనంగా సన్మానించారు. అనంతరం వంద లాది మందికి భారీ అన్నదానం నిర్వహించారు.తపనా సంస్థల అధినేత, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్య దర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నదానా నికి రూ 25 వేలు విరాళం అందజేశారు. అనంతరం గంగనమ్మను గారపాటి చౌదరి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తపనా చౌదరిని ఘనంగా సన్మానించారు.

గ్రంథాలయ ఉద్యమానికి శ్రీకారం



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ నిధులు కేటాయించాలని, పుస్తకాల కొనుగోలు చేయాలని గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ పేర్కొన్నారు. ఏలూరులో గురువారం ప్రతి నిధుల సమావేశాన్ని ఫ్లాష్ టీమ్ కార్యాలయంలో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.సాగర్ అధ్యక్షత వహించగా వక్తగా హాజరైన శివప్రసాద్ మాట్లాడుతూ మనం చెల్లిస్తున్న ఆస్తి పన్నులో గ్రంథాలయ పన్ను కూడా ఉంటుందని అన్నారు. గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోళ్లు, ఉద్యోగ కల్పన చేయాలన్నారు. ఈ నెల 27న విజయవాడ ఎంబీ విజ్ఞాన భవన్‌లో రాష్ట్ర సదస్సు జరగనుందని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంఘ నాయకులు, అభ్యుదయ రచయితలు పాల్గొన్నారు.

భూ రీసర్వే బృందానికి సహకరించండి



రీ సర్వేపై గ్రామసభలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సాయిబాబా

టి.నర్సాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రెండవ విడత ప్రారంభమయ్యే భూరీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సాయిబాబా కోరారు. ఏపిగుంట పంచాయతీలోని గుర్వాయిగూడెం రీసర్వేపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో రైతులు తమ పొలం దస్త్రాలు అధికారులకు చూపి సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రావంతి, సర్వేయర్ వెంకట రమణ, వీఆర్వో ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు : రైతులు తమ భూ సమస్యలను రీ సర్వే ద్వారా పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు.గురువారం నిడమర్రు మండంలో రీసర్వేకు సంబంధించి కృష్ణాపురం రైతులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ నాగేశ్వరరావు, సర్వేయర్ విశ్వనాథ్, వీఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు.

● పోలవరం : భూ రీసర్వేపై గ్రామ పంచాయతీల వారీగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు సాయిరాజు గురువారం తెలిపారు. మండలంలో గ్రామ సభల నిర్వహణకు అన్ని పంచాతీల్లో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ద్వారా ప్రచారాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు.

●ద్వారకాతిరుమల : భూ రీసర్వేపై శుక్రవారం గ్రామసభ నిర్వహించనున్నట్టు వీఆర్వోలు భవాని, మహాలక్ష్మి తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రామ సభకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో, తహసీల్దార్ అధ్యక్షత వహిస్తారని ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం రైతులు ఈ సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు.

స్వయం ఉపాధి రుణాలను వినియోగించుకోండి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి సోపానం రుణ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్‌లు పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ అందిస్తున్న సబ్సిడీ రుణాలకు షాదిఖానాలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలో సబ్సిడీ రుణాలకు 5,847మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 407మందిని ప్రాథమికంగా ఎంపిక చేసి రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు.

● టి.నర్సాపురం : ఉపాధి సోపానం సబ్సిడీ రుణాలకు 1248 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు 800మంది హాజరైనట్టు ఎంపీడీవో మణికుమారి తెలిపారు. టి.నర్సాపురం యూనియన్ బ్యాంకు, మెక్కినవారిగూడెం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, బొర్రంపాలెం కెనరా బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకోగా వచ్చిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు.

● నిడమర్రు : మండలానికి కేటాయించిన వంద యూనిట్లకు గాను 650 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇంటర్వ్యూకు 474 మంది హాజరైనట్టు అధికారులు తెలిపారు. గురువారం బావాయిపాలెం, ఛానమిల్లి, క్రొవ్విడి, సిద్ధాపురం, నిడమర్రు, భువ్వనపల్లి, మందలపర్రు, గుణపర్రు గ్రామాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు.

● చింతలపూడి : ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నగర పంచాయతీ పరిధిలో కార్పొరేషన్ రుణాల కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించగా 335 మంది హాజరైనట్టు మునిసిపల్ కమిషనర్ డి.పావని తెలిపారు. వీరిని కేటగిరి వారీగా విభజించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు 561 మంది దరఖాస్తు చేసుకున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ తెలిపారు. అలాగే మండల స్థాయిలో 1206 మంది దరఖాస్తు చేసుకోగా గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 1080 మంది హాజరైనట్టు ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ తెలిపారు.

● పెదవేగి : స్వయం ఉపాధి సోపానంలో రాయితీ రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన గురువారం నిర్వహించారు. పెదవేగి మండలంలో 151 యూనిట్లకు 1125 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. లబ్ధిదారులను ఎంపిక చేసి, యూనిట్లను మంజూరు చేస్తామని ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు.


జయకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎ.ఎస్.ఐ జయకుమార్‌కు సన్మానం

టి.నర్సాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలని ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. టి.నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఏ.ఎస్.ఐ. జయకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. మాట్లాడుతూ జయకుమార్ నిబద్ధతతో అంకితభావంతో పని చేశారని అన్నారు.అనంతరం జయకుమార్ మాట్లాడుతూ 38 ఏళ్ల పోలీస్ శాఖకు సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ ఏ.ఎస్.ఐ. నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ హెచ్‌సీ సుబ్బారావు, రైటర్ ఎం.రాజు, హెచ్.సి.వెంకటేశ్వర రావు, పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు

వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ

గత వైసీపీ పాలనలో ధ్వంసం

నిడమర్రు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : వాటర్ ప్లాంట్ నిర్మించి ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన అభినందనీయమని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. గురువారం క్రొవ్విడి గ్రామ సెంటర్‌లో మహ్మద్ సాజిత్, మహ్మద్ మాజిద్,సారిక లెనిన్ బాబు, వాకమూడి ఇంద్ర కుమార్‌ల ఆర్థిక సహకారం రూ. 3 లక్షలతో పునర్నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ఈ ప్లాంట్‌ను ధ్వంసం చేయగా స్థానికులతో కలిసి ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. గత వైసీపీ పాలనలో పడగొట్టిన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నిడమర్రు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు.గురువారం నిడమర్రు మండలంలో నిడమర్రు, అడవికొలను, ఎనికేపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, మంచి నీటి చెరువుల తవ్వకం, మోటార్ల ప్రారంభం వంటి అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, నాయకులు చింతలపాటి బాపిరాజు, నిమ్మల దొరబాబు, ముత్యాలస్వామి, పోశెట్టి రామ్మూర్తి, పైడికొండల శివాజీ, ఆదిరెడ్డి చంద్రరావు, ముత్యాల పెదబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

లింగపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కందుల వాణి తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించుకునేందుకు మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు.

చదువులో ప్రతిభ కనబర్చాలి

పెదపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : చదువులో ప్రతిభ కనబర్చాలని యూనిసెఫ్ ఎ.టి.ఎల్ కో-ఆర్డినేటర్ టి.సుదర్శన్ తెలిపారు. వట్లూరులోని డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను యూనిసెఫ్ ఎటీఎల్ కో-ఆర్డినేటర్ సుదర్శన్ గురువారం సందర్శించారు. విద్యార్థులకు సంబంధించిన పలు రికార్డులను, వారు రూపొందించిన స్మార్ట్ ఆటోమేటెడ్ మిషన్, స్మార్ట్ కార్ పార్కింగ్ సిస్టమ్, స్మార్ట్ క్యాప్ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూస్సీరాణి, సైన్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షురాలిగా విజయకుమారి నియామకం

చింతలపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పట్టణ అధ్యక్షురాలిగా కొత్తపల్లి విజయకుమారిని నియమించినట్టు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోట వెంకట నారాయణ తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు నియామక పత్రం అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్.ప్రసాద్, మోహన్‌రావు, పసుపులేటి శ్రీను, శ్యాంశేఖర్ పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘనపై జరిమానా

చింతలపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : సారా కేసులో రాఘవాపురానికి చెందిన నిందితుడు ఇందుమూరి రాంబాబును గతంలో తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయగా ఉల్లంఘించాడు. బైండోవర్‌ను ఉల్లంఘించినందుకు, సారా కేసులో పట్టుపడినందుకు లక్షా 75 వేల రూపాయల జరిమానా విధించినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెదపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయాలని వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కె.సాయి రోహిత్ తెలిపారు. రామచంద్ర కళాశాల ఆధ్వర్యంలో విహన్ అనాధ శరణాలయంలోని వృద్ధులు, అనాధలకు అవసరమైన నిత్యావసర సరుకులను కళాశాల సిబ్బంది గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. సిబ్బంది పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న రాంబాబు

నిరుపేదకు చేయూత

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి టీడీపీ మండల క్లస్టర్ ఇంచార్జ్ రేగంటి రాంబాబు సాయం అందజేశారు.తల్లిదండ్రులను కోల్పోయిన ఓ యువతి వివాహ నిశ్చితార్థం నిమిత్తం రూ.25 వేలు అందించారు. జి.కొత్తపల్లికి చెందిన కట్టూరి దుర్గ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. ఆ యువతికి గురువారం వివాహ నిశ్చితార్థం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాంబాబు ఈ సాయం అందజేశారు.

సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దెందులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కార్యాలయం వద్ద రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగుతో పాటు ప్రజల ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. డ్రైనేజీ లేకపోవడంతో మండల కార్యాలయాల వద్ద ప్రవహిస్తున్న మురుగుతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ప్రచురించడంతో అధికారులు తక్షణ చర్యల్లో భాగంగా డ్రైనేజీ తవ్వించారు. డ్రైనేజీ ఏర్పాటుతో రోడ్డుపై మురుగు ఆగిపోయింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో వాహనాలు జారిపడి పలువురు గాయపడ్డారు.

ఆలపాడు-కొల్లేటికోట రోడ్డుకు మోక్షం



నూతనంగా వేసిన ఆలపాడు-కొల్లేటికోట ఆర్‌అండ్‌బీ రహదారి

కైకలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ధ్వంసం అయిన రహదారులకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టాయి. 2021వ సంవత్సరంలో కొల్లేరు వరద ముంపుతో ఆలపాడు-కొల్లేటికోట ఆర్‌అండ్‌బీ రహదారి నెలల తరబడి ముంపులో ఉంది. ఆ సమయంలో ధ్వంసమైన రహదారుల అప్పటి పాలకులు వదలి వేశారు. ఏళ్ల తరబడి కొల్లేటి లంక గ్రామాల ప్రజలు, పెద్దింటి అమ్మవారి భక్తులు ఇబ్బందులు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది నవంబరు నెలలో వచ్చిన వరద ప్రభావంతో మళ్లీ రహదారులు ముంపునకు గరయ్యాయి. యుద్ధప్రాతిపాదికన ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులను అత్యవసర రహదారి నిర్మాణ పనులకు కేటాయించారు. దీంతో ఆలపాడు నుంచి సర్కారు కాల్వ వరకు సుమారు 3.5 కిలోమీటర్ల రహదారి తారురోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. లంక గ్రామాల ప్రజలు, పెద్దింటి అమ్మవారి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనర్లకు బైక్ ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు : ఎస్‌ఐ

కైకలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని కైకలూరు టౌన్ ఎస్సై డి.వెంకట కుమార్ అన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు మొగ్గు చూపేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు గురైతే దానికి తల్లిదండ్రులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపవడం వల్ల ట్రాఫిక్ నిబంధనలు తెలియక ఇటీవల అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అందువల్ల ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. మైనర్లు బైక్ నడిపితే వారి తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి

ఇంటర్ ద్వితీయ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కైకలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందజేసిన పాఠ్య, నోటు పుస్తకాలను ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి పంపిణీ చేశారు. గురువారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పుస్తకాలను అందజేశారు. రెండు రోజులుగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నామన్నారు. ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఈనెల 7 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మూడు కాసుల బంగారు ఆభరణాలు అపహరణ



గోపవరంలో చోరీకి గురైన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

కైకలూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్టు కైకలూరు టౌన్ ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. కైకలూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన గూడురు వెంకట లక్ష్మీనాగేశ్వరరావు గత నెల 23వ తేదీన ఇంటికి తాళం వేసి విశాఖపట్నంలో ఉంటున్న ఆయన కుమార్తె వద్దకు వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి రాగా తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సీఐ వి.కృష్ణ, ఎస్సై శ్రీను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం కోసం వేధింపులు..కేసు నమోదు

ముదినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న ఘటనపై గురువారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పెదపాలపర్రుకు చెందిన ఓ యువతికి కాళ్ళ మండలం బొండాడకు చెందిన నాగబాబుతో వివాహమైంది. వివాహ సమయంలో కొంత కట్నం ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగా సాగిన అనంతరం అదనపు కట్నం తెమ్మని భర్త, అత్త నుంచి ఆ యువతికి వేధింపులు పెరిగాయి. దీంతో ఇటీవల ఆమె పుట్టింటికి వచ్చేసింది. గురువారం అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రకాలువలో రైతు గల్లంతు



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లక్కవరం గ్రామానికి చెందిన రైతు చల్లా బసవయ్య (70) పశువులను మేపడానికి వెళ్లి ఎర్రకాలువలో పడి గల్లంతయ్యాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరం గ్రామానికి చెందిన చల్లా బసవయ్య ప్రతీ రోజు పశువులను మేపి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తాడు. గురువారం సాయంత్రం పొలంలో పశువులు మాత్రమే వస్తుండడంతో స్థానికులు ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. వెతికారు. ఎర్రకాలువ ఒడ్డున బసవయ్య చెప్పులు, టవల్, కర్ర ఉండడంతో పశువులను కడగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడని భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో రాత్రి పొద్దు పోయేవరకు గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ లభ్యం కాలేదు. లక్కవరం ఎస్సై శశాంక సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు పర్యవేక్షించారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సీటీ స్కాన్

నెల రోజుల తర్వాత అందుబాటులోకి..




రోగికి సీటీ స్కాన్ తీస్తున్న దృశ్యం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నెల రోజుల తర్వాత సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మరామ్మతు అనంతరం గురువారం యధావిధిగా పని చేస్తుంది. మార్చి 1న సిటీ స్కాన్ మిషన్‌లోని ట్యూబు పోవడంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులు మరమ్మతు చర్యలు చేపట్టారు. సుమారు రూ.25 లక్షల విలువైన ట్యూబు బుధవారం సాయంత్రానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది. ఇంజనీర్లు కొన్ని గంటల పాటు మరమ్మతులు నిర్వహించి ట్యూబ్‌ను అమర్చారు. రోగులకు గురువారం ఉదయం నుంచి సిటీ స్కాన్ తీస్తున్నారు. గురువారం ఒక్కరోజే 42 స్కాన్‌లను తీశారు. ప్రభుత్వాసుపత్రిలో సిటీ స్కాన్ సేవలు పూర్తిగా ఉచితం. ప్రభుత్వాసుపత్రి ఓపీ విభాగంలో కాని ఇన్‌పేషెంటుగా ఉన్న వారికి సంబంధిత ఆసుపత్రి వైద్యుల సూచన మేరకు స్కానింగ్‌ను తీస్తున్నారు. సిటీ స్కాన్ అందుబాటులోకి రావడంతో రోగులకు ఖర్చు, సమయం కలిసి వచ్చింది.

పోలవరం ప్రభుత్వ కార్యాలయాల్లో

డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



పోలవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో జిల్లా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మావోయిస్టుల భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరుగుతున్నట్లు భావిస్తున్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పూర్తి

▸▸ 12 మోడల్ ప్రైమరీలు, ఏడు ఫౌండేషన్, 40 బేసిక్ ప్రైమరీల ఏర్పాటు

▸▸ ఒక్క పాఠశాల కూడా రద్దు కాకుండా జాగ్రత్తలు

ముదినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల పునర్వ్య వస్థీకరణ ప్రక్రియ పూర్తయింది. మోడల్ ప్రైమరీ, బేసిక్ ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు ఖరారైంది. మండలంలో 12 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఎంపిక చేయగా, ఏడు బేసిక్ ఫౌండేషన్ పాఠశాలలను ఏర్పాటు చేసి 40 పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా ప్రభుత్వం మార్గదర్శక సూత్రాల ప్రకారం కొనసాగిస్తున్నారు. మండలంలోని చిగురుకోట, కొత్త దళితవాడ, అల్లూరు, కొరగుంటపాలెం, వడాలి-1, రంగాపురం, వణుదుర్రు, గురజ -1, గురజ-2, సింగవరం, సింగరాయపాలెం, వైవాక మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేశారు. గొల్లగూడెం, జానకి గూడెం, వడాలి-2, పెదగరువు, కొత్తపల్లి, చేవూరుపాలెం, బొమ్మినంపాడు శివారు పాత దళితవాడ ప్రాథమిక పాఠశాలలను 1, 2 తరగతులు ఉండే ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చారు. మండలంలో మిగిలిన 40 ప్రాథమిక పాఠశాలలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా కొనసాగుతాయని మండల విద్యాశాఖాధికారి కె.నరేష్ కుమార్ తెలిపారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమిస్తారు. బొమ్మినంపాడు శివారు కొత్తదళితవాడ మోడల్ ప్రైమరీ పాఠ శాలలో అదే గ్రామంలోని గొల్లగూడెం, జానకిగూడెం ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేశారు. వడాలి-1 మోడల్ ప్రైమరీ స్కూల్‌లో వడాలి -2, సింగరాయపాలెం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో చేవూరుపాలెం ప్రాథమిక పాఠశాలల్లోని 3,4, 5 తరగతులను విలీనం చేశామని ఎంఈవో తెలిపారు.



మోడల్ ప్రైమరీ స్కూలుగా ఎంపికైన గురజ ప్రాథమిక పాఠశాల

వైవాకలో మంత్రి లోకేశ్ చొరవతో హైస్కూలు..హర్షం

వైవాక మండల పరిషత్ యూపీ పాఠశాలను జడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసినందుకు రాష్ట్ర విద్యా మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అందించిన సహకారం హర్షణీయమని గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్ అన్నారు. వైవాక నుంచి సుమారు 80 మంది విద్యార్థులు హైస్కూలు చదువులకు దూరంగా ఉన్న పెదతుమ్మిడి హైస్కూలుకు వెళ్లడం ఇబ్బందికరంగా ఉన్నందున తమ గ్రామంలోని యూపీ స్కూలును హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంపీ పుట్టా మహేష్ ద్వారా తాము ఇచ్చిన వినతిపై మంత్రి లోకేష్ వెంటనే స్పందించి అనుమతులు ఇచ్చారని నాగేంద్ర కుమార్ తెలిపారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు

కలిదిండి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు, సర్పంచ్‌లు చర్యలు చేపట్టాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటిపై అధికారులు, సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఎంపీపీ మాట్లాడుతూ పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు తాగటానికి అనువుగా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఫిల్టర్ బెడ్లు పని చేయకపోవడంతో చెరువుల్లో నీరు నేరుగా పైపుల ద్వారా సరఫరా అవుతోందన్నారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు చర్యలు తీసు కోవాలన్నారు. తాగునీరు వృథా కాకుండా పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. చెరువుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. ఈనెల 15న కాల్వలకు తాగునీరు విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ముందుగా అడుగంటిన చెరువులను నింపుకోవాలన్నారు. ఎంపీడీవో కొండలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్, ఈవోపీఆర్‌డీ బి.రమేష్ బాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు



సింగరాయపాలెం బాబాజీ మఠంలోని కోదండరామస్వామి

ముదినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పురాతన మఠాల్లో ఒకటైన ముదినేపల్లి మండలం శింగరాయపాలెం బాబాజీ మఠంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు దేవదాయ,ధర్మాదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మఠం ఆచార సంప్రదాయాలతో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం బంజారీల ఆదిగురువులకు బోద్ పూజలు, కోదండరామస్వామి కల్యాణ కార్యక్రమాలు ఒకే రోజున విశిష్ట రీతిలో జరగడం ఇక్కడి ఆనవాయితీ. ఆ ఆనవాయితీ ప్రకారమే నవమి వేడుకలకు స్వామి వార్లను అమ్మవారిని వివిధ రకాల అలంకరణలతో ముస్తాబు చేశారు. 6న నవమి సందర్భంగా కోదండరామస్వామి తిరుకల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో నాయుడు తెలిపారు.

కిరాణా అప్పు ఆలస్యంగా కట్టాడని..

ముదినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కిరాణాషాపులో అరువుపై తీసుకున్న సరుకులకు సొమ్ము సకాలంలో చెల్లించకుండా ఆలస్యం చేసినందుకు ఒక వ్యక్తిని వ్యాపారి కొట్టిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముదినేపల్లిలోని గూడవల్లి జగదాంబకు చెందిన కిరాణా షాపులో కొద్దిరోజుల కిందట ఈడే పెద్దేశ్వరరావు అనే వ్యక్తి రూ. 1750 విలువైన సరుకులు అరువుపై కొనుగోలు చేశాడు. ఒకసారి వెయ్యి, మరికొంత కాలానికి రూ.750 చెల్లించాడు. గురువారం ఆ కిరాణా షాపు వద్దకు వెళ్ళిన పెద్దేశ్వరరావును వ్యాపారి జగదాంబ అప్పు ఆలస్యంగా చెల్లించడంపై అడగడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం పెరిగింది. దీంతో పెద్దేశ్వరరావుపై జగదాంబతో పాటు గూడవల్లి కోటయ్య అనే వ్యక్తి కలసి దాడి చేసి తీవ్రంగా కొట్టారు. పెద్దేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్ర రావు తెలిపారు.



బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

యర్రావారిగూడెం మీదుగా హైదరాబాద్‌కు బస్సు సర్వీస్

చాట్రాయి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి చాట్రాయి మండలం యర్రావారిగూడెం, కొత్తగూడెం గ్రామాల మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసును బుధవారం రాత్రి ప్రారంభించారు. యర్రావారిగూడెంలో మంత్రి పార్థసారధి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు 10 కిలో మీటర్లు వెళ్లి హైదారాబాద్ బస్సు కోసం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకువెళ్లగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో యర్రా రాజబాబు, మలగలపల్లి సుబ్రహ్మణ్యం, వెల్ది నాగేశ్వరరావు, యర్రా రాజమోహనరావు, మరిడి శ్రీనివాసరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఎంపీడీవో

మండవల్లి ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా నిరంతరం తాగునీరు సరఫరాకు చేసేలా చర్య లు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో 100 శాతం పన్నులు వసూళ్లకు చర్యలు తీసుకోవా లని, పారిశుధ్యం నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	145, 154, 165
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	390
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

అర్జీలు సకాలంలో పరిష్కరించండి : సబ్ కలెక్టర్



రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ స్మరణరాజ్

ముసునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ స్మరణరాజ్ అధికారులను ఆదేశించారు. ముసునూరు తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా సమస్యలు, కొత్త పాస్ పుస్తకాల అర్జీల పరిష్కారంపై సబ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎందుకు జాప్యం జరుగుతుందని అధికారులను ప్రశ్నించారు. పెండింగ్ అర్జీలను మూడు రోజుల్లో పరిష్కరించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్, వీఆర్వోలను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ పారిశుధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం వద్ద గురవారం ధర్నా చేశారు. పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల యూనియన్ కార్యదర్శి కె.జయలక్ష్మి, గౌరీ, భారతి, పంగిడమ్మ, భవాని చంద్రశేఖర్, ఏడుకొండలు, శోభన్‌బాబు, జాను పాల్గొన్నారు.



నవోదయంపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారి అజయ్‌కుమార్‌సింగ్

సారా తయారీ, విక్రయ కేసుల్లో కఠిన శిక్షలు

నూజివీడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎక్సైజ్ అధికారి సీహెచ్.అజయ్ కుమార్ సింగ్ అన్నారు. సిద్ధార్థ నగర్ కోహిరాల తండా తదితర గ్రామాలలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రచార కార్యక్రమం అనంతరం నిర్వహించిన దాడుల్లో 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి సిద్ధార్థ నగర్‌కు చెందిన బాణావతి పంగిడి అమ్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తుమ్మగూడెంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి



శివాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయుడు

చాట్రాయి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఛత్రపతి శివాజీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట్రావు, విద్యార్థులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ గొప్ప వీరుడే కాక ప్రజల కోసమే ప్రభుత్వం అనే సూత్రాన్ని పాటిస్తూ ఆదర్శ పాలన అందించారన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని హెచ్‌ఎం సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థుల ర్యాలీ

ముదినేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం సింగరాయపాలెంలో వ్యవసాయశాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం మండల ఇన్‌చార్జ్ గౌతం కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం రామ్మోహనరావు, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యశాస్త్రి, బుక్ కీపర్ నాగరాణి, ఐసీఆర్‌పీలు సుధాకర్, నళిని, జగన్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరణ

వైభవంగా సీతారామస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కలిదిండి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తాడినాడలో అపరభద్రాద్రిగా పేరొందిన రామాలయంలో సీతారామస్వామి కల్యాణోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు కందాడ శ్రీమన్నారాయణ, చక్రవర్తి ఆచార్యులు స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. చతుస్థానార్చన, నిత్య హోమం బలిహరణ తదితర పూజలు నిర్వహించారు. ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. 6న అల్లూరి అచ్యుత రామరాజు, సరస్వతీ దంపతులచే సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ సుశీల

చలివేంద్రం ప్రారంభం

ముదినేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవి దాహార్తిని తీర్చేందుకు ముదినేపల్లి మండలం పెయ్యేరు పంచాయతీ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం ఎంపీడీవో వై.రామకృష్ణ ప్రారంభించారు. సర్పంచ్ అల్లు సుశీల, టీడీపీ నాయకులు దుక్కిపాటి శేషుబాబు, దాకరం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ జాస్తి బాబూ రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ దివి సతీష్, పంచా యతీ కార్యదర్శి జి.రమేష్ పాల్గొని పలువురికి తాగునీటిని అందజేశారు.

నేడు రీసర్వేపై గ్రామసభ

కైకలూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రీసర్వే సమస్యలపై ఆటపాకలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తెలిపారు. ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తామని రీసర్వే పైలెట్ ప్రాజెక్ట్-2గా ఆటపాక గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

170 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చాట్రాయి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెంలో బుధవారం రాత్రి రెండు వాహనాలలో అక్రమంగా రవాణా అవు తున్న 170 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సీఎస్ డీటీ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఒక వాహనంలో 130 క్వింటాళ్లు, మరో వాహ నంలో 40 క్వింటాళ్ళు మొత్తం 170 కింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రరావు, మాదిరాజు కృష్ణశివదీప్, వాహన డ్రైవర్లు డేరాంగుల శివ మల్లికార్జునరావు, చప్పిడి వెంకట కృష్ణ, వాహన యజమానులు లోకవరపు శ్రీనివాసరావు, కె.మల్లీశ్వరిపై కేసులు నమోదు చేసినట్లు డీటీ చెప్పారు.

నేడు లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు

ఆగిరిపల్లి ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బ్యాంక్ అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆనంబాబు తెలిపారు. బీసీ, కాపు, కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులు ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలని తెలిపారు.

ఎన్యూమరేటర్లకు ముగిసిన శిక్షణ

మండవల్లి ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక జీవనోపాధి కల్పిం చేలా ఎన్యూమరేటర్లు బాధ్యత తీసుకోవాలని జిల్లా డీపీఎం రామోజీ పేర్కొన్నారు. మండ వల్లిలో 157 మంది ఎన్యూమరేటర్లుకు గురువా రం జరిగిన 3 రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలో 1301 స్వయం సహాయక సంఘాల్లోని గ్రామ సంఘాల సమావేశం నిర్వహించి ప్రతీ సభ్యురాలి జీవనోపాధి వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఏపీఎం రాజశ్రీ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.